Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665


NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts





వరంగల్ | సంపుటి 2 | సంచిక 62 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం 03.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

వైఎస్సార్ ఆశయాలు.. పూర్తి చేసి తీరుతాం!

- సీఎం రేవంత్ రెడ్డి

ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులకు సీఎం హామీ

రైతుల కోసం వైఎస్సార్ చేసిన సేవలను గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దే

తెలంగాణలో 3.40 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం : సీఎం

నిత్యం నిఘా, న్యూఢిల్లీ : దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కలలుగన్న ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు.డాక్టర్ వైఎస్సార్–డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అవార్డు–2026 ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు... 2





7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ 'బంగారం కొనొద్దంటున్నా'రేంటి?

- బంగారం కొనొద్దని మోదీ మరోసారి పిలుపు
- విదేశాల్లో పెళ్లిళ్లకూ దూరంగా ఉండాలని విజ్ఞప్తి
- బంగారం దిగుమతులతో భారీగా విదేశీ మారకం ఖర్చు
- చమురు ధరల పెరుగుదలతో మరింత ఒత్తిడి
- జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు

2



ముద్ర లోన్ అప్రూవ్డ్ మెసేజ్‌లా? జాగ్రత్త, ఇది కొత్త మోసం!

- ముద్ర లోన్ మంజూరైందంటూ వచ్చే వాట్సాప్ మెసేజ్‌లు నకిలీవి
- ఇవి మోసగాళ్లు పంపుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ
- ఆధార్, పాన్ వివరాలు ఎవరికీ పంపవద్దని ప్రజలకు సూచన
- అధికారికంగా బ్యాంకుల్లోనే ముద్ర లోన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచన
- ముద్ర సంస్థ నేరుగా ప్రజలకు రుణాలు ఇవ్వదని వెల్లడి

వివరాలు 2 లో..

"ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

2

టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ : మంత్రి పొన్నం ప్రభాకర్

- 1000 రోజుల పాలనలో టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- సంస్థలోకి 2,932 కొత్త బస్సులు.. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట
- ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు

2



నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!

- నేపాల్‌లో భారీ వర్షాలతో పలు నదులకు పోటెత్తిన వరదలు
- మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టం హెచ్చరిక స్థాయిని దాటిన వైనం
- మర్స్యంగ్డి నదిలో ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్న వరద
- నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటమే వరదలకు కారణం

2



కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

- రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు
- 'ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని వ్యాఖ్య

నిత్యం నిఘా, మునుగోడు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!

- ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ
- పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ
- అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి



వివరాలు 2 లో..

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 2

ముద్ర లోన్ అప్రూవ్డ్ మెసేజ్‌లా?
జాగ్రత్త, ఇది కొత్త మోసం!

మొదటిపేజీ తరువాయి..

ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) కింద రుణం మంజూరైందంటూ వాట్సాప్ వేదికగా సర్క్యులేట్ అవుతున్న నకిలీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. కొందరు దుండగులు ఇటువంటి సందేశాల ద్వారా ప్రజల నుంచి ఆధార్, పాన్ కార్డ్, బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. "మీ ముద్ర లోన్ దరఖాస్తు ఆమోదించబడింది" అంటూ వచ్చే సందేశాలు పూర్తిగా నకిలీవని, ప్రభుత్వం ఇటువంటి సమాచారాన్ని వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పంపించదని కేంద్రం స్పష్టం చేసింది. ముద్ర అనేది బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు పునఃరుణసహాయం (రీఫైనాన్స్) అందించే సంస్థ మాత్రమేనని, వ్యక్తులకు లేదా వ్యాపారా సంస్థలకు నేరుగా రుణాలు మంజూరు చేయదని వివరించింది. ముద్ర రుణాల మంజూరు కోసం ఎటువంటి ఏజెంట్లు లేదా మధ్యవర్తులు లేరని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అర్హులైన వారు నేరుగా సమీపంలోని బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ), లేదా మైక్రో ఫైనాన్స్ సంస్థలను (ఎంఎఫ్ఐ) సంప్రదించి రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా, అధికారిక 'ఉద్యమమిత్ర' పోర్టల్ (udyamimitra.in) ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎటువంటి అనుమానాస్పద సందేశాలు వచ్చినా, వాటిని factcheck.pib.gov.in పోర్టల్‌కు పంపి వాస్తవాలను నిర్ధారించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు..
మళ్లీ వరద ముప్పు!



మొదటిపేజీ తరువాయి.. హిమాలయ దేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో, అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల నాటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్డి నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుండెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది.

నాపై కాదు.. ముందు
రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!

మొదటిపేజీ తరువాయి.. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చగొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.

వైఎస్సార్ ఆశయాలు.. పూర్తి చేసి తీరుతాం!
- సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

రైతుల గుండెల్లో రారాజు

బతికున్నన్ని రోజులు రైతుల కోసం పరితపించిన వైఎస్సార్‌ను గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని సీఎం అన్నారు. 2003లో మండుటెండల్లో నిరుపేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వైఎస్సార్ చేపట్టిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అప్పట్లో రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని అన్నారు.

చివరి కోరికను నెరవేర్చాలి

డాక్టర్ వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణలో సాగునీటి విస్తరణకు ఆయన ఆశయంగా నిలిచిన ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రైతులకు మరింత మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

పేదల ఆహార భద్రతకు పునాది

గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థ



(PDS)ను తీసుకొచ్చారని సీఎం తెలిపారు. బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర వస్తువులను పేదలకు అందించే ఈ విధానం దేశంలో ఆహార భద్రతకు పునాది వేసిందన్నారు. అదే విధంగా తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, ఇది ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పీడీఎస్ విధానం వల్లే సాధ్యమైందని రేవంత్ రెడ్డి వివరించారు.

ప్రముఖుల హాజరు

కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేశ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ 'బంగారం కొనొద్దంటున్నారేంటి?

మొదటిపేజీ తరువాయి.. దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధితో దూసుకెళుతోంది. అయినా ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు.. సరదా కోసం విదేశాలకు వెళ్లొద్దు.. విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవద్దు అని సూచించారు. దేశం బలంగా ఉన్న సమయంలోనే ఇలాంటి జాగ్రత్తలు ఎందుకు చెబుతున్నారు? దీని వెనుక పెద్ద ఆర్థిక లెక్కే ఉంది. భారత్ తన బంగారం అవసరాల్లో దాదాపు మొత్తం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంటే మనం బంగారం కొన్న ప్రతిసారీ దేశం నుంచి విదేశీ మారకం బయటకు వెళ్తుంది. దిగుమతులు పెరిగితే వాణిజ్య లోటు పెరిగే అవకాశం ఉంటుంది. డాలర్లకు డిమాండ్ పెరిగితే రూపాయిపై కూడా ఒత్తిడి పడుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో బంగారం దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 32 శాతానికి పైగా పెరిగాయి. జులైలో భారత్ వస్తువుల వాణిజ్య లోటు దాదాపు 32 బిలియన్ డాలర్లకు చేరింది. జనవరి తర్వాత ఇదే అత్యధిక స్థాయి. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధి వద్ద అంతరాయాల భయాలు చమురు మార్కెట్లను కలవరపెడుతున్నాయి. చమురు ధరలు పెరిగితే భారత్‌కు మరిన్ని డాలర్లు అవసరమవుతాయి. అదే సమయంలో బంగారం దిగుమతులు కూడా పెరిగితే విదేశీ మారకంపై ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. అందుకే అవసరం లేని దిగుమతుల్ని తగ్గించాలన్నది మోదీ సూచనలోని ప్రధాన ఉద్దేశం. విదేశీ పర్యటన అంటే విమాన టికెట్లు, హోటళ్లు, ఆహారం, స్థానిక రవాణా వంటి వాటిపై విదేశాల్లో ఖర్చు చేయడం. ఇక డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే ఖర్చు మరింత భారీగా ఉంటుంది. అందుకే మోదీ అన్ని విదేశీ ప్రయాణాలను ఆపాలని చెప్పలేదు. అత్యవసరం కాని పర్యటనలు, విదేశీ పెళ్లిళ్లను మాత్రం మరోసారి ఆలోచించండి అన్నదే ఆయన సందేశం. ఆ డబ్బును దేశంలోనే ఖర్చు చేస్తే స్థానిక వ్యాపారాలు, సేవలకు ప్రయోజనం కలుగుతుందన్నది స్వదేశీ ఆలోచన. మేలో అమెరికా-ఇరాన్ ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనూ మోదీ ఇదే తరహా పిలుపునిచ్చారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని, అవసరం లేని విదేశీ ప్రయాణాలను తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయడం, ప్రజా రవాణా ఉపయోగించడం, కార్‌పూలింగ్ చేయడం వంటి సూచనలు కూడా చేశారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇది అంచనాల కంటే మెరుగైన ఫలితమే. అయితే మార్చి త్రైమాసికంలోని 8.6 శాతంతో పోలిస్తే వృద్ధి తగ్గింది. ప్రపంచ యుద్ధాలు, చమురు ధరలు, ద్రవ్యోల్బణం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల వంటి ముప్పులు ఇంకా ఉన్నాయి. అందుకే ప్రస్తుతం ఉన్న ఆర్థిక బలాన్ని భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ అనిశ్చితి కారణంగా బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. ఆగస్టులో అంతర్జాతీయంగా బంగారం ధర దాదాపు 10 శాతం పెరిగింది. ధర పెరిగిన సమయంలో భారతీయుల నుంచి డిమాండ్ కూడా బలంగా ఉంటే బంగారం దిగుమతి బిల్లు మరింత పెరుగుతుంది. అందుకే మోదీ పిలుపు వెనుక కేవలం 'బంగారం కొనొద్దు' అనే మాట మాత్రమే లేదు. విదేశీ మారకాన్ని కాపాడటం, రూపాయిపై ఒత్తిడి తగ్గించడం, ప్రపంచ ఆర్థిక షాక్‌ల ప్రభావాన్ని తగ్గించడం, దేశీయ వ్యాపారాలను బలోపేతం చేయడం వంటి నాలుగు కీలక లక్ష్యాలు ఉన్నాయి.

"ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..
కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్న పూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను పదిలి పెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ : మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అమలు చేశామని, ప్రస్తుతం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, గతంలో సర్వీసు నుంచి తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరో 1500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, సీసీఎస్, పీఎఫ్ బకాయిలను గణనీయంగా తగ్గించామని మంత్రి వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ విలీన ప్రక్రియను యూనియన్ ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 3

వరంగల్ పోలీసింగ్‌కు ప్రత్యేక గుర్తింపు

గంజాయిపై ఉక్కుపాదం.. రౌడీయిజానికి నో ఛాన్స్.. ట్రాఫిక్, సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి

ఫేమ్ కోసం కాదు.. ఫలితం కోసం పనిచేస్తా : సీపీ శ్వేతారెడ్డి



వరంగల్ పోలీస్ కమిషనరేట్, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):

వరంగల్ కమిషనరేట్ పరిధిలో అర్బన్, రూరల్ ప్రాంతాలు కలగలిసి ఉండటంతో ఇక్కడి పోలీసింగ్ ప్రత్యేకంగా ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌తో పోలిస్తే వరంగల్ పోలీసింగ్‌లో భిన్నమైన సవాళ్లు ఉంటాయని, అర్బన్, రూరల్ ప్రాంతాల పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. వరంగల్ ప్రాంతంలో తాను తొలిసారిగా పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నానని, గతంలో ఒకసారి వచ్చి 15 రోజులు డ్యూటీ చేశానని తెలిపారు. చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ప్రధాన నగరంగా ఎదిగిందన్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా

నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి వినియోగం, సరఫరాను అరికట్టేందుకు ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సీపీ తెలిపారు. పోలీసులతో పాటు ప్రజలను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళా సంఘాలను 'సంఘమిత్రలు'గా భాగస్వామ్యం చేసి గంజాయి, ఇతర నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు అందుబాటులో ఉండటంతో క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జనగామలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించడం, మత్తు పదార్థాల ప్రభావం, నేరాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

గంజాయి కేసుల్లో రౌడీషీట్లు

గంజాయి కేసుల్లో పదేపదే పట్టుబడుతున్న వారిపై నిఘా పెంచడంతో పాటు అవసరమైన చోట రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నట్లు సీపీ శ్వేతారెడ్డి తెలిపారు. గంజాయి సరఫరాపై ప్రజల నుంచి పక్కా సమాచారం అందాల్సిన అవసరం ఉందన్నారు. 'ఇక్కడ గంజాయి ఉందట.. వాళ్లు తాగుతున్నారట" అనే సాధారణ సమాచారానికి బదులుగా సరఫరా చేసే వ్యక్తులు, ప్రాంతాలు, వాహనాల వివరాలు అందిస్తే వెంటనే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చే శారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలు కూడా అధికంగా నమోదవుతున్నాయని సీపీ తెలిపారు. సైబర్ కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా కేసుల పరిష్కారంపై దృష్టి సారించామని చెప్పారు.క్రైం కేసులు ఎక్కువగా నమోదవుతున్న మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. అక్కడ అదనపు ఎస్ఐని నియమించి క్రైం కంట్రోల్, పెట్రోలింగ్, నిఘాను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

రౌడీయిజానికి నో ఛాన్స్

రౌడీయిజాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని సీపీ స్పష్టం చేశారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలోని కాలనీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కెమెరాల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలకు అప్పగించామని, కాలనీ సమావేశాల ద్వారా సీసీ కెమెరాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రాధాన్యం

వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీపీ తెలిపారు. యూటర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌లు, రోడ్డు భద్రత అంశాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. కరుణాపురంలో వైన్స్‌కు పెద్ద పర్మిట్ రూమ్ ఉండటంతో ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మూడు యూటర్న్‌లను మూసివేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం ట్రాఫిక్ సాఫీగా సాగుతోందన్నారు.

శాఖల సమన్వయంతో ప్రజా భద్రత

ప్రజల భద్రతే పోలీసింగ్‌లో ప్రధాన లక్ష్యమని సీపీ శ్వేతారెడ్డి అన్నారు. ట్రాఫిక్, ఫ్రీ లెఫ్ట్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు వంటి సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. పోలీసు శాఖ ఒక్కటే అన్ని సమస్యలను పరిష్కరించలేదని, మున్సిపల్ కార్పొరేషన్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అధికారుల చర్యలకు ప్రజల భాగస్వామ్యం కూడా అవ-సరమన్నారు.

స్టేషన్ల వారీగా క్రైం మ్యాపింగ్

కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల స్వభావాన్ని విశ్లేషిస్తున్నామని సీపీ తెలిపారు. మిల్స్ కాలనీ, మట్వాడ, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో క్రైం కేసులు అధికంగా ఉంటే.. కేయూ, హసన్‌పర్తి ప్రాంతాల్లో భూ వివాదాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వివరించారు. స్టేషన్ వారీగా క్రైం ప్యాటర్న్‌ను గుర్తించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



భూ వివాదాల్లో ఎస్ఓపీనే ప్రామాణికం

భూ వివాదాల పరిష్కారంలో ప్రభుత్వం, పోలీస్ శాఖ రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సీపీ తెలిపారు. భూ వివాదాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా జోక్యం చేసుకోకుండా ఎస్ఓపీ ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తాను కూడా ఎస్ఓపీని తప్పనిసరిగా పాటిస్తానని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

పోలీసింగ్‌లో సాంకేతికతకు పెద్దపీట

పరిపాలన, పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ఏఐను సమర్థవంతంగా ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే వాట్సాప్ ద్వారా ఎఫ్ఐఆర్‌లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఫేమ్ కోసం కాదు.. ఫలితం కోసం

పోలీసు అధికారిగా పేరు, ఫేమ్ కోసం పనిచేయనని సీపీ శ్వేతారెడ్డి స్పష్టం చేశారు. చట్టాన్ని నమ్మి, దాని ప్రకారమే విధులు నిర్వర్తిస్తానన్నారు. చట్టంపై తనకు నమ్మకం ఉందని, న్యాయపరమైన ఫలితం వచ్చే వరకు వేచి చూసే ఓపిక కూడా ఉందన్నారు. పోలీసింగ్ ప్రభావవంతంగా ఉండటంతో పాటు దాని ఫలితం ప్రజలకు కనిపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రజలకు భద్రత కల్పించడం, నేరాలను నియంత్రిం చడం, సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపించడంపైనే తన దృష్టి ఉంటుందని సీపీ శ్వేతారెడ్డి వెల్లడించారు.

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 4

విద్యార్థుల విద్యాభివృద్ధికి హోంవర్క్ డైరీల పంపిణీ



నర్సంపేట, సెప్టెంబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి) : నర్సంపేట పాకాల రోడ్డులోని జడ్.పి.హెచ్.ఎస్. మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ హోంవర్క్ డైరీలను పంపిణీ చేశారు. జడ్.పి.హెచ్.ఎస్. నెక్కొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు శ్రీమతి తోట యశోద కనిష్ట కుమారుడు, మహబూబాబాద్ రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ శ్రీ తోట రవీందర్ సౌజన్యంతో ఈ హోంవర్క్ డైరీలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ దామేర నర్సయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కాజంపురం దామోదర్, ఓల్డేజ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి తీరాల యుగేందర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని హోంవర్క్ డైరీలను అందించిన శ్రీ తోట రవీందర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో బాలల ఉద్యానవనానికి స్థల పరిశీలన



పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం బాలల ఉద్యానవనం ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మంజూరైన రూ.13 లక్షల సామాజిక బాధ్యత నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల ప్రవంతి రమేష్‌బాబు, సహాయ ఇంజనీర్ అనుదీప్, హైదరాబాద్‌కు చెందిన ఆటస్థలాల ఏర్పాటు సంస్థ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారెడ్డితో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. బాలల ఉద్యానవనం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు ఆటలు, వినోదానికి అనువుగా ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు బాలల ఉద్యానవనం వంటి సౌకర్యం అందుబాటులోకి రానుండటంపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అమరధామంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఘన నివాళులు



పరకాల, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరకాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అమరధామాన్ని సందర్శించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. వారి పోరాట స్ఫూర్తి, త్యాగాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అమరవీరులకు నివాళులు అర్పించారు.

హామీల అమలుకు బీఆర్ఎస్ సమరశంఖం..
మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రానికి భారీ బైక్ ర్యాలీ

జేడీ మల్లంపల్లి, సెప్టెంబర్ 02 / (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మల్లంపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్‌లపై తరలివచ్చారు. బీఆర్ఎస్ జెండాలు చేతబూని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రం వరకు ర్యాలీగా వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సమయం గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతు సమస్యలు, రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీలు తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మల్లంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, పరిసర గ్రామాల పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ములుగు అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి : మంత్రి సీతక్క



ములుగు జిల్లా కేంద్రం, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గత పాలకులు పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి విమర్శించారు. రాష్ట్రాన్ని, ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని వారు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ములుగు, మల్లంపల్లి మండలాల్లో ప్రజా ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, ఉద్యోగాల కల్పన, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు తదితర పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బీక్షపతి, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రవిబాబు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, ములుగు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మధు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే ప్రధాన లక్ష్యం
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హనుమకొండ, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఏకతాటిపైకి వచ్చి కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వీ.ఎస్.ఎస్. రామచందర్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా పర్యటనకు వచ్చిన రామచందర్‌రావుకు కాజీపేట వద్ద జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీని తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నో మ్యాపింగ్ కౌంటర్, హెల్ప్‌డెస్క్‌ను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



హనుమకొండ, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (SSR) ప్రక్రియలో భాగంగా హనుమకొండలోని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'నో మ్యాపింగ్ కౌంటర్', హెల్ప్‌డెస్క్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలో ఓటర్లకు అందుతున్న సేవలు, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, నో మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల నిర్వహణ, ఓటర్లకు అందిస్తున్న సేవలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగవంతంగా సేవలు అందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుపై కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ మహా నిరసన..



హనుమకొండ,సెప్టెంబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మహా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కలెక్టరేట్ పరిసరాలు హోరెత్తాయి. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సమయం గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తీవ్రంగా విఫలమైందని ఆరోపించారు. రైతు రుణాలు, పెండింగ్ బకాయిలు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.4

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 5

నేత్ర, అవయవదానంపై విద్యార్థులకు అవగాహన



వరంగల్, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సదాశయ ఫౌండేషన్, అభ్యుదయ సేవా సమితి వరంగల్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానం, అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని దానాల్లో నేత్రదానం ఎంతో ముఖ్యమైనదని, ఒకరి నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగు నింపవచ్చని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టి.శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నేత్రదానం, అవయవదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా తన నేత్రాలు, అవయవాలను దానం చేయడం ద్వారా పలువురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అన్నారు. నేత్రదానం, అవయవదానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించడంలో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రజలకు నేత్రదానం, అవయవదానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశురాములు, కళాశాల హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ పరమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ భగీరథ్, అధ్యాపకులు డాక్టర్ మూర్తి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సుస్మిత, రమేష్, కృష్ణవేణి, డాక్టర్ రాజన్న, ప్రదీప్, ప్రభావతి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నేత్రదానం, అవయవదానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నేత్ర, అవయవదానంపై అవగాహన పొందారు. మరణానంతరం కూడా తమ దానంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ప్రజల మనసు గెలిచిన సీఐ పులి రమేష్‌కు ఘన వీడ్కోలు

- న్యూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆత్మీయ వీడ్కోలు.. చిరు సన్మానం



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీఐ పులి రమేష్‌కు న్యూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి చిరు సన్మానం చేశారు. ఎల్కతుర్తి సర్కిల్‌లో విధులు నిర్వహించిన సమయంలో సీఐ పులి రమేష్ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, జర్నలిస్టులతోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగించారని న్యూ ప్రెస్ క్లబ్ సభ్యులు గుర్తు చేసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై పోలీస్ శాఖకు, మీడియాకు మధ్య సమన్వయం ఉండేలా సీఐ రమేష్ వ్యవహరించారని జర్నలిస్టులు తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటూ, సమాచారాన్ని అందించడంలో సహకరించారని అన్నారు.ఈ సందర్భంగా న్యూ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు సీఐ పులి రమేష్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఎల్కతుర్తిలో ఆయన అందించిన సేవలను, జర్నలిస్టులతో కొనసాగించిన ఆత్మీయ అనుబంధాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సాతూరి చంద్రమౌళి, చిర్రా ఉదయ్ చందర్, నిరంజన్, సతీష్ చారి, నరేష్, బొంకూరి వంశీ, అడ్డూరి అనిల్ తదితర న్యూ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సీఐ పులి రమేష్‌కు న్యూ ప్రెస్ క్లబ్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

సూరారం గ్రామాన్ని చుట్టుముడుతున్న కాలుష్య భూతం

- **క్రషర్ పరిశ్రమలు, గోబర్ గ్యాస్ కేంద్రంతో పెరుగుతున్న దుమ్ము, పొగ..**
- **ఆందోళనలో గ్రామస్థులు**





ఎల్కతుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి) : సూరారం గ్రామ పరిసరాల్లో కొనసాగుతున్న పరిశ్రమల కారణంగా వాయు కాలుష్యం పెరుగుతోందని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న క్రషర్ పరిశ్రమలు, గోబర్ గ్యాస్ కేంద్రం నుంచి వెలువడుతున్న దుమ్ము, పొగ, దుర్వాసనతో వాతావరణం కలుషితమవుతోందని ఆరోపిస్తున్నారు. క్రషర్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న దుమ్ముతో గాలి నాణ్యత దెబ్బతింటోందని గ్రామస్థులు చెబుతున్నారు. గోబర్ గ్యాస్ కేంద్రం నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ రాత్రివేళల్లో మరింత ఇబ్బందులు

కాలుష్య ప్రభావం రాత్రి వేళల్లో మరింత ఎక్కువగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. పొగ, దుర్వాసన కారణంగా ఇళ్లలో ఉండేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. పంట పొలాలు, పశువులు, పరిసరాలపై కూడా కాలుష్య ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ భారీ వాహనాలతో దుమ్ము కాలుష్యం

క్రషర్ పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాల కారణంగా కూడా దుమ్ము విపరీతంగా లేస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. రహదారులపై దుమ్ము పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము గాలిలో కలిసిపోవడంతో పరిసర ప్రాంతాలు మరింత కాలుష్యానికి గురవుతున్నాయని అంటున్నారు.

★ అధికారులు స్పందించాలి

గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో కాలుష్య స్థాయిలను పరిశీలించి, పరిశ్రమలు కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా లేదా తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పరిశ్రమల అనుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలపై అధికారులు సమగ్రంగా పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. “సూరారం గ్రామాన్ని కాపాడుకుందాం.. మన ఊరి భవిష్యత్తు మన చేతుల్లోనే” అంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- **వైఎస్సార్ సేవలు, సంక్షేమ కార్యక్రమాలు చిరస్మరణీయం**
- **సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్‌కుమార్**



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఎల్కతుర్తిలో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద వైఎస్సార్ చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేశారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమ స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం అనిల్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ గోడిశాల రాజయ్య, మాజీ సర్పంచ్‌లు గోడిశాల యాదగిరి, కొమ్మిడి రాజిరెడ్డి, జనగాని లక్ష్మినారాయణ, సీనియర్ నాయకులు డాక్టర్ రమేశ్, పాక రమేశ్, శ్రీపతి సదానందం, యువ నాయకులు గోడిశాల అర్జున్, గుడేల్లి నవీన్, అంచనగిరి వెంకట్, నాయకులు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి బోనాల జాతరలో బోనం ఎత్తిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక**
- **ఎర్రబెల్లి ప్రదీప్‌రావు**



వరంగల్, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులతో కలిసి బోనం ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ప్రదీప్‌రావు అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం నిర్వాహకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ముదిరాజ్ సంఘం నాయకులు భయ్యా స్వామి, బీజేపీ నాయకులు రత్నం కృష్ణకిషోర్, జూలూరి నైనేష్, గొడిశాల కార్తీక్ గౌడ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 6

ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- మున్సిపల్ సిబ్బందికి సన్మానం... మహిళా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



పెద్దపల్లి జిల్లా, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జనసేన పార్టీ అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మూల హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దపల్లి స్టేషన్ రోడ్డులోని హనుమాన్ ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎం.కె.ఆర్. హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50 మంది మున్సిపల్ సిబ్బందిని సన్మానించారు. మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసి వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా మూల హరీష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పుర స్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు పోలోజు విశ్వజ్ఞాచారి, జావాజీ నవీన్, గొట్టె మధుకర్, చెల్కల సుమ యాదవ్, గుండేటి లావణ్య, కానిగంటి మంగ, గాజుల రమేష్, కంది రఘు, పల్లె శ్రావణ్ గౌడ్, మడుపు శివ, మచ్చ మహేష్, నూనె ఐలేశం, గుండేటి ఆశ్రిత్, దొంతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దామెరవాయిలో ఘనంగా
వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

- **ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం**
- **కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోరే బిక్షపతి**



తాడ్వాయి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని దామెరవాయి గ్రామ పంచాయతీలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పర్యాటక గైడ్ మోరే బిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోరే బిక్షపతి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గొప్ప ప్రజా నాయకుడని, ఆయన ఆశయాలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోవద్దని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రచ్చబండ కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్ ప్రమాదవశాత్తు మృతి చెందడం రాష్ట్ర ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా సంక్షేమానికి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉపాధి హామీ పథకం, 108 అత్యవసర సేవలు, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. ఆయన ప్రారంభించిన పలు సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను ఉపసంహరించుకుని, పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని మోరే బిక్షపతి డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో లోడారి కృష్ణ, పూనం నాగమల్లయ్యతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులనూ
ఇంటి నుంచే బుక్ చేసుకునే అవకాశం



ములుగు జిల్లా/ కన్నాయిగూడెం, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎరువుల కొనుగోలును సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (ఎరువుల విక్రయాల వ్యవస్థ) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కన్నాయిగూడెం మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ సూచించారు. సెప్టెంబర్ 2 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్ ద్వారా కేవలం యూరియా ఎరువును మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉండేదని మహేష్ తెలిపారు. తాజాగా అందుబాటులోకి వచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా యూరియాతో పాటు డీఏపీ, వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ తదితర ఎరువులను కూడా ఇంటి నుంచే బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను ముందుగానే యాప్ ద్వారా బుక్ చేసుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. దీంతో ఎరువుల బుకింగ్ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అన్నారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో ఎరువుల బుకింగ్‌కు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని మహేష్ సూచించారు. రైతులందరూ యాప్‌ను సద్వినియోగం చేసుకుని అవసరమైన ఎరువులను సులభంగా బుక్ చేసుకోవాలని కోరారు.

మదర్ థెరిసా మహిళా పొదుపు సంఘంపై
ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్

- **ఆర్థిక లావాదేవీలు, రుణాలు, వడ్డీ రేట్లు, ఖాతాల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలి**
- **కలెక్టర్‌కు ఫిర్యాదు.. జిల్లా సహకార అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు హరికృష్ణ వెల్లడి**



పెద్దపల్లి జిల్లా /మంథని, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలోని మదర్ థెరిసా మహిళా పొదుపు సంఘం నిర్వహణకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. సంఘం నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు, సభ్యుల పొదుపు సొమ్ము, రుణాలు, వడ్డీ రేట్లు, లాభాల్లో సభ్యులకు కల్పిస్తున్న వాటా తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గంగాపురికి చెందిన నామాని గౌరమ్మ కుమారుడు నామాని హరికృష్ణ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం మంథనిలోని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు అంశాలను వెల్లడించారు. మదర్ థెరిసా మహిళా పొదుపు సమితి వ్యవహారాలకు సంబంధించి తాను సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా అధికారులను వివరాలు కోరినట్లు తెలిపారు. సంఘం ఆర్థిక లావాదేవీలు, నిర్వహణ విధానం, సభ్యుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలు, రుణాలు, వడ్డీ తదితర అంశాలపై సమాచారం కోరినట్లు చెప్పారు. తాను కోరిన సమాచారం ఆధారంగా ఆగస్టు 28న పాత్రికేయులకు ప్రకటన చేసినట్లు హరికృష్ణ తెలిపారు. దీనిపై స్పందించిన పొదుపు సంఘం నిర్వాహకులు ఆగస్టు 29న మీడియా సమావేశం నిర్వహించి తన ఆరోపణలను నిరాధారమైనవిగా ఖండించారని చెప్పారు. అయితే ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు, లెక్కలు, అధికారిక రికార్డులను ప్రజల ముందుంచకుండా కేవలం ఆరోపణలను ఖండించడం వల్ల సమస్య పరిష్కారం కాదని హరికృష్ణ అన్నారు. సంఘం నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేకపోతే తాను కోరిన వివరాలను అధికారికంగా వెల్లడించాలని కోరారు. తాను ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ఈ అంశాన్ని లేవనెత్తడం లేదని ఆయన స్పష్టం చేశారు. పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళలు తమ కష్టార్జిత సొమ్మును పొదుపు చేస్తున్నందున, వారి డబ్బుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే వివరాలు కోరుతున్నానని తెలిపారు. సభ్యుల ఆర్థిక భద్రత, పొదుపు సొమ్ము రక్షణ, రుణాల నిర్వహణ, వడ్డీ లెక్కలు తదితర అంశాలపై స్పష్టత అవసరమని అన్నారు. అధికారిక రికార్డులు, లెక్కలు, ఆడిట్ వివరాలను పరిశీలించి అధికారులు వాస్తవాలను వెల్లడిస్తే సభ్యుల్లో ఉన్న అనుమానాలు తొలగిపోతాయని పేర్కొన్నారు.

★ కలెక్టర్‌కు ఫిర్యాదు

ఈ వ్యవహారంపై ఆగస్టు 31న పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసి, మదర్ థెరిసా మహిళా పొదుపు సంస్థ నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలపై విచారణ జరిపించాలని కోరినట్లు హరికృష్ణ తెలిపారు. తన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులతో పాటు జిల్లా సహకార అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.
సంఘానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఆర్థిక వ్యవహారాలపై వాస్తవాలను వెలికితీయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

★ లెక్కలు, రికార్డులు పరిశీలించాలి

సంఘం సభ్యులకు అందిస్తున్న రుణాలపై ఎంత వడ్డీ వసూలు చేస్తున్నారు? ఆ వడ్డీని ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారు? సభ్యుల నుంచి వసూలైన వడ్డీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారు? సంఘానికి వచ్చే లాభాల్లో సభ్యులకు ఎంత మేరకు వాటా కల్పిస్తున్నారు? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని హరికృష్ణ డిమాండ్ చేశారు.

అలాగే సంఘం నిర్వహిస్తున్న ఖాతాలు, సభ్యుల లావాదేవీల రికార్డులు, బ్యాంకు ఖాతాలు, అకౌంట్స్ స్టేట్‌మెంట్లు, నగదు లెక్కలు తదితర వివరాలను అధికారులు పరిశీలించాలని కోరారు. అకౌంట్స్ స్టేట్‌మెంట్లలో వ్యత్యాసాలు ఉన్నాయన్న అనుమానాలపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. మదర్ థెరిసా మహిళా పొదుపు సమితి రిజిస్ట్రేషన్, నిర్వహణ విధానం, సభ్యుల సంఖ్య, కార్యవర్గం, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఆడిట్ నివేదికలు తదితర రికార్డులను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు.తాను చేస్తున్న ఆరోపణలు నిజమా, కాదా అన్నది అధికారుల విచారణలో తేలుతుందని, కాబట్టి ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రికార్డుల ఆధారంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని హరికృష్ణ కోరారు. మహిళల పొదుపు సొమ్ముకు సంబంధించిన వ్యవహారం కావడంతో అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోపణలు తప్పయితే అధికారిక రికార్డులతో వాటిని ఖండించాలని, నిజానిజాలు తేలాలంటే వ్యక్తిగత విమర్శలకు బదులుగా లెక్కలు, రికార్డులు, ఆడిట్ వివరాలు ప్రజల ముందుకు రావాలని హరికృష్ణ పేర్కొన్నారు. ఇప్పటికే పొదుపు సంఘం నిర్వాహకులు తమపై వచ్చిన ఆరోపణలను ఖండించిన నేపథ్యంలో, సంబంధిత అధికారుల విచారణలో ఎలాంటి వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక రికార్డులు, ఖాతాలు, ఆడిట్ వివరాల పరిశీలన పూర్తయిన తర్వాతే ఆరోపణల్లో వాస్తవమెంత, అవాస్తవమెంత అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

పాలకుర్తి బస్టాండ్‌లో కనీస సదుపాయాలు కల్పించాలి : సీపీఎం

- **గుంతలమయమైన రహదారులు.. తాగునీరు, రాత్రి బస్సుల కొరతతో ప్రయాణికుల అవస్థలు**



జనగామ జిల్లా/ పాలకుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలకుర్తి బస్టాండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు పాలకుర్తి బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్‌లో గుంతలమయంగా మారిన రహదారులను పరిశీలించి, ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకుర్తి బస్టాండ్ పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉందని విమర్శించారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమన్నారు.

★ గుంతల రోడ్లతో ఇబ్బందులు

బస్సులు నిలిపే ప్రదేశంలోని రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయని తెలిపారు. వర్షాకాలంలో బస్సులు రాకపోకలు సాగించే సమయంలో బురద ప్రయాణికులపై పడుతోందని, ఎండాకాలంలో దుమ్ము కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పాలకుర్తి నుంచి తొర్రూరు, కొడకండ్ల, తిరుమలగిరి, హనుమకొండ, మొండ్రాయి, వరంగల్, దేవరుప్పుల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాలకుర్తి–తిరుమలగిరి, పాలకుర్తి–మొండ్రాయి, పాలకుర్తి–కొడకండ్ల, పాలకుర్తి–తొర్రూరు మార్గాల్లో అదనపు బస్సు ట్రిప్పులు నడపాలని డిమాండ్ చేశారు. జనగామ నుంచి పాలకుర్తికి రాత్రి 8.30 గంటల తర్వాత బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

★ సీసీ రోడ్లు, ప్రహరీ గోడ నిర్మించాలి

గతంలో రోడ్డు విస్తరణ చేపట్టడంతో బస్టాండ్‌లోని అంతర్గత రహదారులు కిందికి పడిపోయాయని సీపీఎం నాయకులు తెలిపారు. బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లే సమయంలో, బయటకు వచ్చే సమయంలో డ్రైనేజీ డివైడర్లు అడ్డంకిగా మారుతున్నాయని చెప్పారు. బస్టాండ్‌లోని రహదారులను పైకి లేపి సీసీ రోడ్లతో మరమ్మతులు చేపట్టాలని, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఆర్టీసీ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాలకుర్తి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, ముస్కు ఇంద్రారెడ్డి, నాయకులు బి. వెంకన్న, కే. సోమయ్య, పి. బాలయ్య, కే. పద్మ, జి. లక్ష్మి, కే. వెన్నెల, బి. రేణుక, డి. చంద్రమ్మ, జి. బుచ్చమ్మ, కే. ఎల్లమ్మ, ఈ. లచ్చమ్మ, మైసమ్మ, యాక లక్ష్మి, మహేశ్వరి, యాకమ్మ, ఎం. నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 7

420 హామీల తొలి ముద్దాయి మంత్రి శ్రీధర్‌బాబే : పుట్ట మధూకర్

- ఆరు గ్యారెంటీలు అమలు చేసిన తర్వాతే ఓట్లు అడగాలి.. మంథని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నిరసన

పెద్దపల్లి జిల్లా /మంథని, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలపై ఎక్కడైనా కేసులు పెట్టాల్సి వస్తే తొలి ముద్దాయి మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబేనని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో 420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శనతో నిరసన చేపట్టి బాకీ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వేయి రోజులు గడిచినా ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. మేనిఫెస్టోను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించిన మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పుడు హామీలను విస్మరించారని ఆరోపించారు. హామీల అమలుపై ప్రశ్నించే వారిపై పోలీసు కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. తండ్రి ఆశయాల కోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే శ్రీధర్‌బాబు.. తన సొంత గ్రామం ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతుల కల్పనపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టించడమే తండ్రి ఆశయమా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, పెన్షన్ల పెంపు, రైతుభరోసా, రైతు కూలీలకు రూ.12 వేలు, వడ్లకు బోనస్, గృహజ్యోతి వంటి హామీల అమలు పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని కుటుంబ సభ్యుల కోసం హైదరాబాద్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసి సంపాదించుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంథని అభివృద్ధి పేరుతో చేపడుతున్న రోడ్ల విస్తరణలో వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పరిహారం విషయంలో అధికారులు ప్రజల పట్ల ఒక విధంగా, ఇతరుల పట్ల మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని ప్రజలకు క్షమాపణ చెప్పి, ఆరు గ్యారెంటీలను అమలు చేసిన తర్వాతే ఓట్లు అడగాలని పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు.

★ అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు: జక్కు శ్రీహర్షిణీ రాకేష్

ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మంథని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ ఆరోపించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వేయి రోజులు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం మినహా మిగతా హామీల అమలుపై ప్రజలకు స్పష్టత లేదని విమర్శించారు. పేదల ఇళ్ల కూల్చివేతలు, రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలపై ఉన్న శ్రద్ధ ప్రజా హామీల అమలుపై లేదని ఆరోపించారు. మంథని ఎమ్మెల్యే 20 ఏళ్లుగా అబద్ధాలతో గెలుస్తున్నారని, మేనిఫెస్టో పేరుతో తెలంగాణ భవిష్యత్తును వెనక్కి తీసుకెళ్లారని జక్కు శ్రీహర్షిణీ రాకేష్ ఆరోపించారు. మహిళలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, గ్యారెంటీలపై ప్రశ్నించాలని, అన్ని హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



హామీలు ఏవీ?.. ప్రభుత్వాన్ని నిలదీస్తూ గర్జించిన గులాబీ దళం

- **కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో హామీల అమలు ఎక్కడ?**
- **బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చర్ల, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం చర్ల నుంచి భద్రాచలం వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 ద్విచక్ర వాహనాలతో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. గులాబీ జెండాలు, ప్లకార్డులు చేతబూని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, ఆసరా పింఛన్ల పెంపు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వంటి హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు.ర్యాలీలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలంపేట 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు

-కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన.. ఏఎస్ఐ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురణ

ములుగు జిల్లా,సెప్టెంబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పురావస్తు అధ్యయన విభాగం (ఏఎస్ఐ) ఆగస్టు 31, 2026న జారీ చేసిన ప్రకటన నం. ఎస్.ఒ.4802(ఇ)ను 'గెజిట్ ఆఫ్ ఇండియా' ప్రత్యేక సంచికలో ప్రచురించింది .'ప్రాచీన కట్టడాలు–పురావస్తు ప్రదేశాలు–అవశేషాల చట్టం–1958'లోని సెక్షన్ 4, ఉప సెక్షన్ (3) కింద సంక్రమించిన అధికారాల మేరకు ఈ ప్రకటన జారీ చేసినట్లు ఏఎస్ఐ వెల్లడించింది.



★ రామప్ప ఆలయానికి సమీపంలో చారిత్రక కట్టడం

పాలంపేట గ్రామంలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం 'కాకతీయ రుద్రేశ్వర' (రామప్ప) ఆలయానికి నైరుతి దిశలో గొల్లల గుడి ఉంది. తూర్పు ముఖంగా ఉన్న మండపంతో పాటు మూడు గర్భాలయాలు కలిగిన త్రికూటాలయంగా ఈ కట్టడం కనిపిస్తుంది. ప్రహరీపై శిల్పాలంకరణ, పైకప్పు అంచు నిర్మాణం, ద్వారబంధాల వద్ద చెక్కిన హంసల వరుస, సునిశిత రంధ్రాల వల పనితనం ఈ ఆలయ ప్రత్యేకతలను చాటుతున్నాయి. ప్రధాన ఆలయం ముందు భాగంలో రెండు ఉప ఆలయాలు ఉండగా, వాటి ద్వారపాలకుల శిల్పాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఉప ఆలయాల ముందు భాగంలోని అంతరాలయాల అంచులు సైతం సున్నితమైన శిల్పకళతో అలరారుతున్నాయి.

★ శిల్పకళకు నిలువెత్తు నిదర్శనం

ప్రధాన ఆలయంలోని మండపం నుంచి మధ్యభాగంలోని మందిరానికి ప్రవేశ మార్గం ఉంటుంది. ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిశల్లో అంతరాలయాలతో కూడిన మూడు గర్భాలయాలు ఉన్నాయి. ఆలయ కుడ్యాలపై ఏర్పాటు చేసిన వివిధ గూళ్లలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, గణేశుడు, మహిషాసురమర్దిని తదితర శిల్పాలు దర్శనమిస్తాయి.జంతువుల ఆకృతులు, పుష్పాలంకరణలతో తీర్చిదిద్దిన ఎత్తయిన వేదికపై గొల్లల గుడి నిర్మితమైంది. జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించడంతో పాలంపేటలోని కాకతీయుల శిల్ప, నిర్మాణ వారసత్వానికి మరింత ప్రాధాన్యం లభించినట్లైంది.

చండ్రుపట్లలో వీబీజీ రామ్ జీ పథకంపై అవగాహన సభ

- 318 రకాల పనులకు దరఖాస్తు చేసుకోవచ్చు.. ఏపీఓ సత్య



ములుగు జిల్లా/వాజేడు, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): వాజేడు మండలంలోని చంద్రుపట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం వీబీజీ రామ్ జీ (VB-G RAM G) పథకంపై అవగాహన కల్పించేందుకు తొలి గ్రామసభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా ఈ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ సత్య మాట్లాడుతూ.. వీబీజీ రామ్ జీ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ పొలాల్లో నీటి కుంటలు, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టుకోవచ్చని తెలిపారు. ఇంటి యజమానులు ఇంకుడు గుంతలు, గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు తదితర పనులు కూడా మంజూరు చేయించుకునే అవకాశం ఉందన్నారు. మొత్తం 318 రకాల పనులకు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అవసరమైన పనుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పనులను గుర్తించిన అనంతరం త్వరలో గ్రామసభలో తీర్మానం చేస్తామని ఏపీఓ సత్య తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అనుముల సంధ్యారాణి, ఉప సర్పంచ్ జైన ప్రసన్న, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్‌రావు, సీనియర్ మేట్ గోగు తిరుపతిరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, ఆశా వర్కర్ బాగుతు సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలపై గులాబీ దళం గర్జన

- 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ములుగులో బీఆర్ఎస్ ర్యాలీ.. ప్రధాన చౌరస్తాలో ధర్నా

ములుగు, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలను గుర్తుచేస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ములుగు శివారులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వరకు సాగింది. అనంతరం ప్రధాన చౌరస్తాలో ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు.

★ ఆరు గ్యారెంటీలపై ప్రశ్నలు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీల వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతులకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని ప్రకటించి, ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందలేదని ఆరోపించారు. కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు.

★ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై నిలదీత


యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని చేసిన హామీలు అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఉద్యోగ నియామకాలు, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. తెలంగాణను పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపిన కేసీఆర్ పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. సమ్మక్క బ్యారేజీ, మిషన్ భగీరథ ద్వారా గిరిజన ప్రాంతాలకు నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే తమ నిరసనలు ములుగుకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాయని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

- బోరు మోటార్ మార్చే క్రమంలో ప్రమాదం..

భార్య, ఇద్దరు పిల్లలను వదిలి మృత్యువాత



జనగామ జిల్లా, పాలకుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ క్షేత్రంలో బోరు మోటార్‌ను మార్చే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అనపర్తి ఉపేందర్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం.. ఉపేందర్, అతని అన్న చెరో రోజు తమ వ్యవసాయ పొలాలకు బోరు నీటిని అందించుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉపేందర్ వంతు కావడంతో బోరు మోటార్‌ను తన పొలం వైపు తిప్పే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ఉపేందర్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 8

జంగాలపల్లి క్రాస్‌రోడ్‌కు స్మశాన వాటిక స్థలం

- 30 గుంటల భూమిని కేటాయించేందుకు రెవెన్యూ అధికారుల పరిశీలన..



ములుగు/జంగాలపల్లి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు మండలం జంగాలపల్లి క్రాస్‌రోడ్ గ్రామానికి స్మశాన వాటిక నిర్మాణం కోసం భూమిని కేటాయించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. గ్రామంలో స్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామాభివృద్ధి, స్మశాన వాటికకు స్థలం కేటాయింపు అంశంపై మాజీ పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనూరు అశోక్‌గౌడ్, జంగాల పల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్నే రతన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజల సమస్యను విన్న మంత్రి సానుకూలంగా స్పందించి, వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మశాన వాటిక కోసం అనువైన స్థలాన్ని సర్వే చేసి కేటాయించాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గ్రామంలో భూమిని పరిశీలించి సుమారు 30 గుంటల భూమిని స్మశాన వాటిక కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ స్థలంలో స్మశాన వాటిక నిర్మాణానికి మంత్రి నిధుల నుంచి సుమారు రూ.15 లక్షలు మంజూరు చేయనున్నట్లు సీతక్క తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. స్మశాన వాటికకు స్థలం కేటాయింపుతో గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించనుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి సీతక్కకు స్థానిక నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు భూరం చేరాలు, నాగపురి విజయ హరినాథ్, నాగపురి ఆనంద్, మాజీ మేడారం ట్రస్ట్ బోర్డు సభ్యుడు జక్కుల రవి, మాజీ నీటి సంఘం చైర్మన్ భీమగాని బిక్షపతి, భీమగాని రాజమౌళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

420 హామీలు.. 1000 రోజుల మోసం!

-కాంగ్రెస్ పాలనపై అరూరి రమేష్ నిప్పులు..

హామీల అమలులో దారుణ వైఫల్యం: బీఆర్ఎస్ పోరుబాట







వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి.. 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేదని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా బుధవారం వర్ధన్నపేటలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ఫ్లెక్సీల ప్రదర్శనతో ర్యాలీ కొనసాగింది. అనంతరం ప్రజలకు కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు.

*** 420 హామీలకు సమాధానం చెప్పాలి**

ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి.. 1000 రోజులు గడిచినా ప్రజలు ఒక్కో హామీ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు."ఎన్నికల ముందు మాటలు చెప్పడం.. అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడమే కాంగ్రెస్ పాలనగా మారింది" అని ఆయన ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బీఆర్ఎస్ పోరుబాట చేపట్టిందన్నారు.

*** సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేశారంటూ ఆరోపణ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అరూరి రమేష్ ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు గతంలో అందిన సంక్షేమ ఫలాలు ప్రస్తుతం సక్రమంగా అందడం లేదని అన్నారు.

*** ప్రతి గ్రామంలో పోరుబాట ఉధృతం ..** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని అరూరి రమేష్ స్పష్టం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో పోరుబాటను మరింత ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమిటి? వాటిలో ఎన్ని అమలయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని, హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్‌కు ఆయుధం!

- **ఇల్లందలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు**
- **పేదలు, రైతుల సంక్షేమమే వైఎస్సార్ లక్ష్యం: వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ**



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి విశేష ప్రాధాన్యం ఇచ్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆయన 17వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇల్లంద కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎద్దు రాజేంద్రప్రసాద్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎద్దు సత్యనారాయణ మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితేనే పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం గుర్తుకొస్తుందని అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అమలు చేసిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పనిచేసిన వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, వార్డు మెంబర్ భాషబోయిన ప్రవీణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దుప్పెల్లి ఏలియా, పోశాల మధుకర్, సంగినేని రాజు, బూడిది శ్రీను, పొల్లపెల్లి శ్రీను, గడ్డల శ్రీను తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

- నిమజ్జన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి.. మట్టి గణపతుల ప్రతిష్ఠాపనను ప్రోత్సహించాలి



హనుమకొండ,సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): వినాయక చవితి, గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లు, నిమజ్జన కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై పోలీస్ కమిషనర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య, మైనింగ్, మత్స్య, అగ్నిమాపక తదితర శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసు, అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో, స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. గణపతి మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, పోలీసు అధికారులు మండపాలను తనిఖీ చేస్తారని తెలిపారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సౌండ్ పొల్యూషన్ లేకుండా చర్యలు చేపట్టాలని, రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి శబ్ద కాలుష్యానికి తావివ్వరాదన్నారు. విద్యార్థులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే స్థానిక ఏసీపీ అనుమతి తీసుకోవాలని తెలిపారు. పెద్ద మండపాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ఉత్సవాల తొమ్మిది రోజుల పాటు నిర్దేశిత సమయాలను పాటించాలని కోరారు. ఉత్సవాలకు వినియోగించే వాహనాల భద్రతను ముందుగానే తనిఖీ చేసుకోవడంతో పాటు మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

★ మట్టి గణపతులను ప్రోత్సహించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలు, ఉత్సవ కమిటీలను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు. నీటి లభ్యత, నిల్వల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విగ్రహాల పరిమాణాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. పెద్ద విగ్రహాల ఏర్పాటు విషయంలో పోటీ పడకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు నిమజ్జనం సమయంలో నీటి వనరులపై భారం తగ్గుతుందని తెలిపారు. రోడ్లపై శాశ్వత నిర్మాణాలు చేపట్టడం, రోడ్లకు నష్టం కలిగించే విధంగా మండపాల ఏర్పాట్లు చేయడం వంటివి చేయరాదని సూచించారు. అన్ని వర్గాల సమన్వయంతో సోదరభావం, మతసామరస్యంతో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

★ నిమజ్జన ఏర్పాట్లపై ప్రత్యేక ప్రణాళిక

వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అన్ని ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీ ఎన్.శ్వేత సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లు, లైటింగ్, బారికేడ్లు, వైద్య సిబ్బంది వంటి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువుల నీటిమట్టం, లోతు, నీటి లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిమజ్జన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా స్థానిక ప్రాంతాలకు సమీపంలోనే అనువైన నిమజ్జన ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులకు సంబంధించిన ట్రాఫిక్ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని, చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అన్నారు. నిమజ్జన సమయంలో చిన్నారులు, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మండపాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు నిమజ్జన పాయింట్ల వద్ద పరిశుభ్రతను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిమజ్జన మార్గాల్లో అవసరమైన రోడ్డు మరమ్మతులు, మౌలిక వసతులు కల్పిస్తామని, అవసరమైన చోట్ల లైటింగ్, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఉత్సవాల సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ కంట్రోల్ రూమ్ 8712685048 కు సమాచారం అందించాలని సీపీ ఎన్.శ్వేత సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీసీపీలు దారా కవిత, అంకిత్‌కుమార్, రాజమహేంద్ర నాయక్, జనగామ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏసీపీలు, పోలీస్ అధికారులు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543
Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 03.09.26_Layout 1 9/3/2026 6:08 AM Page 9

సమరభేరికి తరలిన తాడ్వాయి గులాబీ దండు

- **కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం..**
- **ప్రభుత్వంపై దండుగల మల్లయ్య విమర్శలు**



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపడుతున్న పోరుబాటలో భాగంగా ములుగులో నిర్వహించనున్న సమరభేరి సన్నాహక సమావేశానికి తాడ్వాయి మండల బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు సూచనలతో తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు బయలుదేరారు. ఈ సందర్భంగా దండుగల మల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో ములుగు నియోజకవర్గానికి చెప్పుకోదగిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు.

★ బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి: మల్లయ్య

ములుగును జిల్లాగా ఏర్పాటు చేసింది మాజీ సీఎం కేసీఆర్ అని, మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని మల్లయ్య అన్నారు. ములుగు జిల్లాకు ప్రభుత్వ ఆసుపత్రిని తీసుకొచ్చినప్పటికీ.. అందులో అవసరమైన వైద్య సిబ్బందిని నియమించలేని పరిస్థితి నెలకొందని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కలెక్టర్ భవనం, గిరిజన యూనివర్సిటీ తదితర అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయో మంత్రి సీతక్క ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన పనులకు ప్రస్తుత ప్రభుత్వం శంకుస్థాపనలు చేస్తూ తమవిగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు.

★ ఇసుక మాఫియాపై ఆరోపణలు

గోదావరి నీటిని ప్రజలకు వినియోగించకుండా ఇసుకను తరలిస్తున్నారని మల్లయ్య ఆరోపించారు. ఇసుక మాఫియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయోజనం పొందుతోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎమ్మెల్యే భవనం నుంచే ప్రస్తుత మంత్రి పరిపాలనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వ్యాఖ్యానించారు.

★ పోరాటం కొనసాగిస్తాం

ములుగులో నిర్వహించనున్న సమరభేరి సన్నాహక సమావేశాలు ప్రారంభం మాత్రమేనని, అంతం కాదని దండుగల మల్లయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతి అన్యాయాన్ని బీఆర్ఎస్ ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు. సమరభేరి సన్నాహక సమావేశానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, తాడ్వాయి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దండుగల మల్లయ్య, రఫీక్, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కాక లింగయ్య, గజ్జల సమ్మయ్య, గజ్జల సారయ్య, గజ్జల మహేష్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ధన్నపేట పోలీసింగ్ కు కొత్తదిశ - సీఐ సంజీవరావు

- **వర్ధన్నపేటలో నేరాలకు చెక్..శాంతి భద్రతల పరిరక్షణే తొలి ప్రాధాన్యం**
- **ప్రజలకు అందుబాటులో ఉంటూ...అసాంఘిక కార్యకలాలపై కఠినచర్యలు**



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై. సంజీవరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పోలీసు సేవలు అందిస్తామని సీఐ సంజీవరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజలు, పోలీసుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేస్తూ.. ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తామని సీఐ సంజీవరావు పేర్కొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు.. మహిళలకు ఆర్థిక భరోసా

- **మంగపేటలో 2,257 కొత్త కార్డుల పంపిణీ.. 6,214 మందికి లబ్ధి**
- **కుట్టు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు కుట్టు యంత్రాలు: మంత్రి సీతక్క**



మంగపేట, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మంగపేట మండలంలో 2,257 నూతన రేషన్ కార్డుల ద్వారా 6,214 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కొత్తగా వివాహమైన వారితోపాటు అర్హులైన కుటుంబాలకు ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కుటుంబంలోని అర్హులైన సభ్యులందరికీ సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళల పేరుతో రేషన్ కార్డులు జారీ చేస్తూ కుటుంబంలో వారికి ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు.

★ 70 మంది మహిళలకు కుట్టు యంత్రాలు

స్థానికంగా కుట్టు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు త్వరలో ద్రువపత్రాలతోపాటు కుట్టు యంత్రాలు అందించే బాధ్యత తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఏకరూప దుస్తులు కుట్టే పనులను శిక్షణ పొందిన మహిళలకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంఘాలకు మంజూరైన భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ములుగులో నిర్మించిన ఇందిర మహిళా శక్తి భవనాన్ని సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని అన్నారు. వ్యాపార నిర్వహణపై అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, గ్రామాల అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఫైసల్ హుస్సేని, తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి నూతన సీఐగా కొండ్రు శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

- శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొండ్రు శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా ఎల్కతుర్తికి వచ్చిన ఆయన పోలీస్‌స్టేషన్‌లో అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన సీఐకు స్వాగతం పలికారు. 2009 బ్యాచ్‌కు చెందిన కొండ్రు శ్రీనివాస్ గతంలో హుస్నాబాద్, వరంగల్‌తో పాటు అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ)లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, విభాగాల్లో పనిచేసిన అనుభవంతో ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమర్థవంతమైన పోలీసింగ్ అందించేందుకు ఆయన సిద్ధమయ్యారు.

★ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు సమస్యలపై వేగంగా స్పందించి, పోలీస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

★ ప్రజలకు నిత్యం అందుబాటులో..

ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావడంలో ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని సీఐ తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. పోలీసులు, ప్రజల మధ్య సమన్వయం ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, ప్రజల నమ్మకాన్ని కాపాడే విధంగా విధులు నిర్వహిస్తామని నూతన సీఐ కొండ్రు శ్రీనివాస్ తెలిపారు.

గణేష్ ఉత్సవాల్లో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- **'బీ సైబర్ స్మార్ట్' అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ**
- **సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలి : ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



భూపాలపల్లి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'Be Cyber Smart' అవగాహన పోస్టర్లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పండుగల సమయంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, క్యూఆర్ కోడ్‌లు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని హెచ్చరించారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

★ మోసానికి గురైతే వెంటనే 1930కు

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసానికి సంబంధించిన లావాదేవీలపై అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.గణేష్ ఉత్సవాలను ప్రజలు ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవడంతో పాటు సైబర్ భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, సైబర్ సెక్యూరిటీ ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్, సైబర్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

420 హామీలు.. 420 అడుగుల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ నిరసన

- **దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి - ఎర్రబెల్లి దయాకర్‌రావు**
- **వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలి..**
- **రైతుల పరిస్థితి దారుణంగా ఉందని విమర్శ**





జనగామ జిల్లా /పాలకుర్తి, సెప్టెంబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలకుర్తిలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పార్టీ పిలుపు మేరకు పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 420 హామీలను గుర్తు చేస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

★ దొంగ హామీలతో అధికారంలోకి..

ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఏం చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కల్యాణ లక్ష్మి ద్వారా తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, రైతులకు రైతుబంధు వంటి అంశాలు ఉన్నాయని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. వర్షాకాలంలో కూడా రైతులకు సాగునీరు అందడం లేదని, కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో దేవాదుల, ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో సాగునీటి వసతులను విస్తరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు.

★ హామీలు అమలు చేసే వరకు పోరాటం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 420 హామీలను ప్రభుత్వానికి, ప్రజలకు గుర్తుచేసేందుకే 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో వినూత్న నిరసన చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.